క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



వాజేడు: మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను సోమవారం ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, డిప్యూటీ తహసీల్దార్ రాహుల్ చంద్ర వర్మ పరిశీలించారు. జిల్లా ఉన్నతాధికాకారుల ఆదేశాల మేరకు మండలంలోని పలు పాఠశాలలను వారి చూశారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు ఉన్నది లేనిది పరిశీలన చేశారు.

ఆర్థికసాయం అందజేత



వెంకటాపురం(కె): మండలంలోని యాకన్న గూడెం గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబానికి సోమవారం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ చేతులమీదుగా రూ. 11 వేల నగదు బాధిత మహిళ రాణికి అందించారు. ఆయన వెంట సొసైటీ అధ్యక్షుడు చిడెం మోహనరావు, నాయకులు రమేష్ ఉన్నారు.

ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలి

ఎస్ఎస్ తాడ్వాయి : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా సీనియర్ నాయకుడు బొల్లు రమేశ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 10 ఏళ్ల పాలనలో మోదీ ప్రజలకు ఒరగబెట్టింది ఏమి లేదన్నారు. సన్న, చిన్నకారు రైతులకు రుణమాఫీ చేయకుండా బడా కార్పొరేట్ సంస్థలకు కొన్ని లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశారన్నారు. ప్రతిపక్షాలపై సీబీఐ, ఈడీ దాడులు చేయిస్తూ, భయభ్రాంతులకు గురిచేసి బీజేపీలో చేరేలా ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. రామమందిరాన్ని తానే నిర్మించినట్లు ప్రజలను మభ్యపెట్టి, హిందుమతాన్ని అడ్డుపెట్టుకొని మరోసారి గద్దెను ఎక్కాలని ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను రాష్ట్రంలో భారీ మెజార్టీతో గెలిచేలా ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు.

మాంసం విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఎస్సీ మర్రిగూడెం గ్రామంలో పశుమాంసం విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం మేజర్ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్షుడు అనంద్ మాట్లాడుతూ మాంసాన్ని గ్రామాల మధ్యలో కోసి విక్రయించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పశువులను జనవాసాల మధ్యకోసి కళేబరాలను అక్కడే పడేయడంతో దుర్వాసన వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు శివ, మల్లికార్జున్ చంటి, తదితరులు ఉన్నారు.

25న సర్వసభ్య సమావేశం

కాటారం: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 25న ఎంపీపీ పంతకాని సమ్మయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్వసభ్య సమావేశంలో మండలానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని కోరారు.

నియామకం

మహాముత్తారం: మండలంలోని బోర్లగూడెం గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి దేవస్థాన చైర్మన్‌గా గ్రామానికి చెందిన రంగు రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామానికి చెందిన పలువురు సోమవారం ఆంజనేయస్వామి ఆలయంలో సమావేశం ఏర్పాటు చేసుకుని కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అదే విధంగా పాలక మండలి సభ్యులుగా ఠాకూర్ లక్ష్మన్, వెన్నపురెడ్డి సాంబశివరెడ్డి, జంగపల్లి వెంకటయ్య, రాజయ్య, ఇనుముల మల్లేష్, అజ్మీరా ధరమ్‌సింగ్, వావిళ్ల రమేష్, జాగరి కమలాకర్, అంతటి రవి, మామిళ్లపల్లి శ్రీనివాస్, ముదురుకోళ్ల రవి, మాలోత్ నవరాంనాయక్, ఐర్నేని భాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని పూజారి కాగితపు వెంకటాచారి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆంజనేయస్వామి భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అసంపూర్తి రోడ్డుతో అవస్థలు

- కంకర పోశారు..బీటీ వేయడం మరిచారు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

గోవిందరావుపేట: మండల పరిధిలోని పాపయ్యపల్లి నుంచి దుంపెల్లిగూడేనికి వెళ్లే దారిని బీటీ రోడ్డు నిర్మాణం కోసం చేపట్టిన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పనులను పూర్తి చేసే విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ చొరవ చూపడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రోడ్డుపై కంకర పోసి వదిలేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కంకర పోసి 11 నెలలు గడుస్తున్నా ఇంతవరకు బీటీ వేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే మండల కేంద్రానికి వెళ్లడంతో పాటు చుట్టు ఉన్న 10 గ్రామాలకు రాకపోకలు సులువుగా ఉంటుంది. ఏడాది కాలంగా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వాహనదారులు ప్రయాణం చేయాలంటే నానా అవస్థలు పడుతున్నారు. మంజూరైన నిధులు పూర్తిస్థాయిలో విడుదల కాక పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతి నిధులు చొరవ తీసుకొని అసంపూర్తి బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కంకర పోసి వదిలేసిన పాపయ్యపల్లి-దుంపెల్లిగూడెం రోడ్డు

వాహనదారుల ఇక్కట్లు..

రోడ్డు పనులు మధ్యలోనే వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం గుండా నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. అత్యవసర పనుల నిమిత్తం ఈ మార్గం గుండా వెళ్లేవారు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఈ రహదారి రెండు వైపుల నుంచి జాతీయ రహదారికి 4 కిలోమీటర్ల దూరం ఉండి పలు గ్రామాలకు రాకపోకలు సాగే అవకాశం ఉంది. త్వరగా బీటీ వేయాలని, సకాలంలో పనులు పూర్తి చేసి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

పూర్తిస్థాయిలో నిధులు మంజూరు కాకపోవడంతో సదరు కాంట్రాక్టర్ బీటీ రోడ్డు పనులను మధ్యలోనే నిలిపివేశాడు. ఒక్క బీటీ వేయడం మాత్రమే నిలిచిపోయింది. అది కూడా త్వరలోనే వేసి పూర్తి చేస్తాం.

– కె.ప్రణీత, ఏఈ ఐటీడీఏ

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి



గురుకులాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ములుగు రూరల్ : పాఠశాల అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని బరిగలానిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు అందించే సీఎంబీఎఫ్ అల్పాహారాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూసుకోవాలని పాఠశాల హెచ్‌ఎం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్‌కు సూచించారు. అనంతరం పాఠశాల నుంచి గురుకుల పాఠశాలకు ఎంపికైన విద్యార్థులు కాయిత మనుశ్రీ, గరిగ సృజన, రోజీలిన్‌లను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పోషన్న, ఉపాధ్యాయులు రతన్‌సింగ్, రాజు, కుమారస్వామి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



కాళేశ్వరం: కాళేశ్వరం అంతరాష్ట్ర వంతెన సమీపంలోని బార్డర్ చెక్‌పోస్టు వద్ద ఎస్సై భవానిసేన్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేశారు. సోమవారం ఎన్నికల నేపథ్యంలో తెలంగాణకు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి తరలివస్తున్న వాహనాలపై ప్రత్యేక దృష్టిసారించి సోదాలు నిర్వహించారు. అనుమానితులు కనిపిస్తే విచారించి వదిలేశారు.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు



వాజేడు: చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీఓ శ్రీకాంత్‌నాయుడు



ఏటూరునాగారం : చలివేంద్రాన్ని ప్రారంభించి నీటిని అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి

వాజేడు : వేసవిలో దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఉపయోగపడతాయని, బాటసారులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీఓ శ్రీకాంత్‌నాయుడు అన్నారు. మండల పరిధిలోని చెరుకూరులో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాహుల్ చంద్ర వర్మ ఉన్నారు.

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ ఎదుట గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా పంచాయతీ కార్యదర్శి రమాదేవి ప్రారంభించారు. ఎండల తీవ్రత వల్ల బాటసారులకు, ఇతర గ్రామాల నుంచి వచ్చే వారికి దాహార్తి తీర్చడానికి గ్రామ పంచాయతీ ద్వారా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది రవీందర్, వెంకన్న, లక్ష్మీనారాయణ, మాజీ వార్డు సభ్యులు గీకురు భాగ్య, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

- బైక్ సీజ్, ఒకరిపై కేసు

ఏటూరునాగారం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మండల కేంద్రంలోని వై జంక్షన్ వద్ద సోమవారం ఎక్సైజ్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా పస్రా నుంచి వాజేడు మండలంలోని ఘణపురం గ్రామానికి రూ.15వేలు విలువ చేసే మద్యాన్ని పస్రాకు చెందిన కుమ్మరి గోపిచంద్ తనవాహనంపై ఎలాంటి అనుమతి లేకుండా మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం స్వాధీనం చేసుకొని ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి అతడిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

11 మంది బైండోవర్

అలాగే 11 మంది నాటుసారా అమ్మకం, తయారీ చేసినందుకు కన్నాయిగూడెం, ఏటూరునాగారం మండలంలోని తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. బైండోవర్ ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో తిరుపతి, నవీన్, శ్రీనివాస్, ప్రణయ్, నాగరాజు, ట్రైనింగ్ కానిస్టేబుల్ ప్రవళిక, మౌనిక పాల్గొన్నారు.



అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న బీజేపీ

ములుగు రూరల్: రాజ్యాంగ స్ఫూర్తిని బీజేపీ దెబ్బతీస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలో గ్రామ పంచాయతీ గెస్ట్‌హౌజ్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా ప్రముఖ పాత్రికేయుడు న్యూస్‌క్లిక్ ఎడిటర్ ప్రవీణ్ ప్రబీర్ పూర్కాయస్థా రచించిన అలుపెరుగని పోరాటం పుస్తకావిష్కరణ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలపై మాట్లాడిన ప్రతి ఒక్కరిపై బీజేపీ కేసులు నమోదు చేస్తుందని అన్నారు. ప్రజా సంస్థలు, మతోన్మాదంపై బీజేపీ చేస్తున్న దుర్మార్గాలపై మాట్లాడిన ప్రవీణ్ ప్రబీర్ పూర్కాయస్థాపై ఉపా చట్టం నమోదు చేసి అరెస్ట్ చేయడాన్ని ప్రజా సంఘాలు ముక్తకంఠంతో ఖండించాయని తెలిపారు. దేశంలో ప్రజా స్వామ్యాన్ని, లౌకికవాదాన్ని తుంగలో తొక్కే పద్ధతిలో బీజేపీ వ్యవహరిస్తుందని అన్నారు. దేశంలో ప్రజాతంత్ర వాదులు, మేధావులు, ప్రజలు మతోన్మాద బీజేపీని ఓడగొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రత్నం రాజేందర్, గొల్లపల్లి రాజేందర్, గుగ్గిళ్ల సాగర్, దేవానాయక్, జన్ను రవి, సాంబశివ, గఫూర్, చిట్టిబాబు, రాజేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి

రోడ్ల పక్కనే పడేస్తున్న చెత్త

- కోళ్ల వ్యర్థాలతో భరించలేని కంపు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మంగపేట : మండలంలోని ప్రధాన రహదారుల వెంట వివిధ రకాల షాపుల యజమానులు చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. మండలంలోని కమలాపురం నుంచి జిల్లా సరిహద్దు గ్రామం బ్రాహ్మణపల్లి వరకు ఏటూరునాగారం-బూర్గంపాడు ప్రధానరోడ్డు వెంట చెత్తతో పాటు, చికెన్, మటన్ షాపులు, చేపల వ్యాపారులు వ్యర్థాలను రోడ్ల పక్కనే పడేస్తున్నారు. దీంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాల్లో రోజు వారీగా చెత్త సేకరించడంలో ఆయా పంచాయతీల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చెత్త, పాడైపోయిన కూరగాయలు, ఉల్లిగడ్డలు, ఆలుగడ్డలను తీసుకెళ్లి రోడ్డు పక్కన పడేస్తున్నారు. అదేవిధంగా కమలాపురం-మంగపేట మధ్య దొంగలఒర్రె, మార్కెట్‌గోడౌన్, మంగపేట గౌరారం వాగు, మల్లూరువాగు, చుంచుపల్లి టేకు ప్లాంటేషన్, రాజుపేట ముసలమ్మవాగు బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో చికెన్, మటన్ షాపులు నిర్వాహకులు సైతం కోళ్లు, మేకల వ్యర్థాలను రోడ్డు వెంట పడేస్తున్నారు. కుళ్లిన వ్యర్థాలలో కుక్కలు స్వైరవిహారం చేస్తూ రోడ్డు వెంట నడిచివెళ్లే వారిపై దాడిచేసి గాయపరుస్తున్నాయి. రోడ్డు వెంట వెళ్లే ప్రజలు దుర్వాసనను తట్టుకోలేక ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. ఆయా గ్రామపంచాయతీల అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు వెంట చెత్త వ్యర్థాలను పడేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



రాజుపేట సమీపంలోని కప్పవాగు వద్ద పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు

రహదారులే కల్లాలు!

- ఒక వైపు ధాన్యం, మరో వైపు గ్రాసం

టేకుమట్ల: యాసంగిలో వరికోతలు ప్రారంభమైనా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో పాటు, కనీసం ధాన్యాన్ని ఆరబెట్టేందుకు మైదానం లేకపోవడంతో రైతులు రోడ్లపైనే ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. యాసంగిలో ఎక్కువగా ఆడ, మగ వరి వంగడాలను పండించడంతో ముందుగా మగ వరి సొళ్లను కోసి రోడ్లపైనే వేస్తున్నారు. దాంతో ధాన్యం, పశుగ్రాసంతో ప్రధాన రోడ్లు నిండుకుంటున్నాయి. మండలంలోని గర్మిళ్లపల్లి-రాఘవాపూర్ ప్రధాన రోడ్డులో ఒక వైపు ధాన్యం, మరో వైపు పశుగ్రాసంతో నిండుకుంది. రైతు కష్టాలు అలా ఉంటే దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ద్విచక్ర వాహనదారులు పశుగ్రాసం పైనుంచి కానీ, ధాన్యం పైనుంచి కానీ ప్రయాణిస్తే ప్రమాదవశాత్తు పడిపోయే ప్రమాదం ఉంది. రైతులు వారి అవసరాలకు రోడ్డును ఒకవైపు మాత్రమే వినియోగించుకుంటే ప్రమాదాలను కొంత వరకు నివారించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న ధాన్యం, పశుగ్రాసం

నేడు కాంగ్రెస్ పార్టీ కార్నర్ మీటింగ్

మహాముత్తారం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నేడు(మంగళవారం) మండలంలోని యామన్‌పల్లి ప్రధాన కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు పక్కల సడువలి, జెడ్పీటీసీ లింగమల్ల శారద, ఎంపీపీ సుభద్ర సంయుక్తంగా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీతో పాటు పార్టీ రాష్ట్ర నాయకులు, శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు హాజరుకానున్నట్లు వారు తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు

కాటారం: శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మ్యాక అభినవ్ అన్నారు. మండలంలోని దేవరాంపల్లిలో సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాటారం, కొయ్యూర్, మహాముత్తారం ఎస్సైల ఆధ్వర్యంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు గ్రామంలో పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించారు. ఇంటింటా సోదాలు నిర్వహించి గ్రామస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుమానితుల వివరాలు నమోదు చేసుకున్నారు. ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని 35 బైక్‌లను, 8 నంబర్‌ప్లేట్ లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి గొడవలకు పాల్పడవద్దని ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీసులకు సహకరించాలని కోరారు.

భూమి పోతే ఆత్మహత్యలే శరణ్యం

మొగుళ్లపల్లి: మంచిర్యాల నుంచి వరంగల్ వరకు చేపడుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేలో వ్యవసాయ భూములు పోతే ఆత్మహత్యలే శరణ్యమని ఇస్సిపేట రైతులు అన్నారు. సోమవారం మండలంలోని ఇస్సిపేట శివారులో చేపట్టిన న్యూ గ్రీన్ ఫీల్డ్ హైవే సర్వేను ఇస్సిపేట రైతులు అడ్డుకున్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా మంచిర్యాల జిల్లా నుంచి హనుమకొండ జిల్లా ఊరుకొండ వరకు న్యూ గ్రీన్ ఫీల్డ్ హైవే మండలంలోని మొగుళ్లపల్లి, మేదరమెట్ల, ఇస్సిపేట, రంగాపూర్ గ్రామాల ద్వారా వెళ్తుంది. ఆర్ఐ సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల అధికారులు సర్వే నిర్వహిస్తుండగా రైతులు పురుగుల మందు డబ్బాను పట్టుకొని నిరసన వ్యక్తం చేసి సర్వేను అడ్డుకున్నారు. జాతీయ రహదారికి ఎట్టి పరిస్థితుల్లో వ్యవసాయ భూములు ఇవ్వమని భూ నిర్వాసిత రైతులు తెలిపారు. జాతీయ రహదారిలో చాలా మంది రైతులు తమ వ్యవసాయ భూములు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా ఎంతో కాలం నుంచి భూమిని నమ్ముకుని వ్యవసాయాన్ని చేస్తున్నామని భూమి పోతే జీవనోపాధి లేకుండా పోతుందన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ రేటు ప్రకారం కాకుండా ప్రభుత్వ రేటు ప్రకారం ధరలు నిర్ణయించడం రైతులను మోసం చేయడమేనన్నారు. బలవంతంగా రోడ్డు నిర్మాణ పనులు చేపడితే కుటుంబమంతా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామన్నారు. అనంతరం రైతులందరూ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సునీతకు సర్వేను ఆపాలంటూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు రాంరెడ్డి, అన్నారెడ్డి, లింగారెడ్డి, ముత్తరెడ్డి, సంపత్ రావు, కృష్ణ, కొమురయ్య, సుధాకర్ రావు, నరసింగరావు, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



మందు డబ్బాలతో రైతులు

విద్యార్థులకు అభినందన

భూపాలపల్లి రూరల్: మండలంలోని ఆజాంనగర్ మహర్షి పాఠశాలలో 21 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు. మహాత్మా జ్యోతిబాపూలే గురుకులం 5వ తరగతి చదువుకోవడానికి 25 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 21 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. సోమవారం ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయలు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెమోంటోలు ఇచ్చారు. గ్రామస్తులు పాఠశాల అధ్యాపకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కవిత, లక్ష్మి, వనిత, రాజు, మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల: మండల కేంద్రంలోని శాంతినికేతన్ పబ్లిక్ స్కూల్‌లో ఇటీవల సైనిక్-3, నవోదయ-1, గురుకుల పాఠశాలలో 32 సీట్లు సాధించిన విద్యార్థులను నాయకులు, తల్లిదండ్రులు అభినందించి సన్మానించారు. సోమవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మియాపురం హరీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ పాల్గొని మాట్లాడుతూ పాఠశాల నుంచి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి సీట్లు సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన వ్యాపారి కటకం విజయ్ కుమార్ అతడి కూతురు, కొడుకు జన్మదినం సందర్భంగా పాఠశాలకు బీరువాను బహుమతిగా అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు కోటగిరి సతీష్‌ను, విజయ్‌కుమార్‌ను శాలువతో సన్మానించారు.



సీట్లు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

టికెట్లను కౌంటర్ల ద్వారా విక్రయించాలి

భూపాలపల్లి అర్బన్: ఉప్పల్‌లోని క్రికెట్ స్టేడియంలో నిర్వహించనున్న ఐపీఎల్ మ్యాచ్‌కి సంబంధించిన టికెట్లు సాధారణ ధరలకు కౌంటర్ల ద్వారా విక్రయాలు చేపట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నెల 25న జరగాల్సిన ఐపీఎల్ మ్యాచ్‌కి సబంధించిన టికెట్లను పేటీఎంలో అమ్మకానికి ఉంచిన క్షణాల్లోనే అమ్ముడుపోయాయని హెచ్‌సీఏ బోర్డు ప్రకటించినట్లు తెలిపారు. 36వేలకు పైగా టికెట్లను అమ్మకానికి ఉంచిన అరగంటలోపు ఏవిధంగా అమ్ముడుపోయతాయో హెచ్‌సీఏ, సన్‌రైజర్స్ యాజమాన్యాలు ప్రజలకు స్పష్టం చేయాలని ప్రశ్నించారు. బోర్డు కమిటీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



మొగుళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమక్షంలో సోమవారం మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మొగుళ్లపల్లి మాజీ సర్పంచ్ మోటె ధర్మారావుతో పాటు ఆకుల వీరన్న, జనార్ధన్, చంద్రబోస్, శ్యాంరావు, చాట్ల రవి, కిషన్, శివాజీ, శ్రీధర్, తదితరులు చేరారు. పార్టీలో చేరిన నాయకులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సాంబమూర్తి, అప్పం కిషన్, పట్టణ అధ్యక్షులు క్యాతరాజు రమేష్, రాజు, చందర్ రావు, రఫీ,శివారెడ్డి, రవి,శ్రీధర్ పాల్గొన్నారు.

నవవధువు ఆత్మహత్య

ఏటూరునాగారం: ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన నవ వధువు కోమలిక(20) కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగింది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. ఏటూరునాగారం మండలం రాంనగర్ గ్రామానికి చెందిన నూకల గోవింద్‌తో కోమలికకు గత 18 రోజుల క్రితం వివాహం జరిగింది. సోమవారం రాంనగర్‌లోని అత్తగారి ఇంటి వద్దనే ఆమె పురుగుల మందు తాగినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతిపై కారణాలు తెలియాల్సి ఉంది.



కోమలిక మృతదేహం